## క్లుప్తంగా

### ఇంటి వద్దకే విద్యను పకడ్బందీగా అమలు చేయాలి



బాలికను పరిశీలిస్తున్న దృశ్యం

ఓర్వకల్లు : భవితా కేంద్రాల ఆధ్వర్యంలో ఇంటి వద్దకే విద్యా విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ప్రాజెక్టు జిల్లా ఏపీసీ విజయజ్యోతి అన్నారు. శనివారం మండలంలోని నన్నూరు గ్రామంలో చేపట్టిన ఇంటి వద్దకే విద్యా కార్యక్రమాన్ని ఏపీసీతో పాటు, విలీన విద్య సమన్వయకర్త సాయి రాంమోహన్, జీసీడీఓ సునీత తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను గుర్తించి, భవిత కేంద్రాలకు తరలించాలని సూచించారు. క్రమం తప్పకుండా వారికి వ్యాయామ సేవలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీలు పుష్పాంజలి, సీతారామయ్య పాల్గొన్నారు.

### అశోకాలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



డిగ్రీ పట్టాను అందిస్తున్న వీసీ డాక్టర్ సుధీర్ ప్రేమ్‌కుమార్

కల్లూరు: దూపాడు సమీపంలోని అశోకా మహిళ ఇంజినీరింగ్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. శనివారం నిర్వహించిన వేడుకలకు రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ (వీసీ) డాక్టర్ సుధీర్ ప్రేమ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 2022, 2023 సంవత్సరాలలో కోర్సు ముగించిన బి.టెక్, ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమాజం పట్ల తమ బాధ్యతలను గుర్తించి నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.నవీన్, హెచ్‌ఆర్ విజయ్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

### విద్యార్థులకు గుర్తింపుకార్డుల అందజేత



కొత్తకోట స్కూల్‌లో గుర్తింపు కార్డును చూపుతున్న విద్యార్థులు

సి.బెళగల్ : మండలంలోని కొత్తకోట గ్రామ స్పెషల్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు గుర్తింపు కార్డులను ఉపాధ్యాయులు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ స్థాయిలో వసతులు, సౌకర్యాలను ప్రభుత్వం కల్పించింది. హెచ్‌ఎం ధనుంజయ శనివారం ఐడీ కార్డులను అందజేయడంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.

### బ్యాడ్మింటన్ విజేత కర్నూలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీడీఓ రాముడు

గూడూరు: ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గ స్థాయి ఆటల పోటీల్లో శనివారం జరిగిన బ్యాడ్మింటన్ పోటీల్లో కర్నూలు మండలం జట్టు విజేతగా నిలిచింది. ముందుగా క్రీడాకారులను ఎంపీడీఓ రాముడు పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. స్థానిక ఇండోర్ స్టేడియంలో జరిగిన పోటీలో నాలుగు మండలాల జట్లు పాల్గొనగా కర్నూలు జట్టు విజేతగా నిలిచిందని ఎంపీడీఓ తెలిపారు. పురుషుల, మహిళల విభాగంలో ప్రథమ స్థానంలో కర్నూలు, రెండో స్థానంలో గూడూరు, సి.బెళగల్ మండలం మూడో స్థానంలో నిలిచాయని చెప్పారు.

### ధర్మమే జగతికి మూలం



గో పూజలో పాల్గొన్న భక్తులు

గూడూరు: ధర్మమే జగతికి మూలమని తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకుడు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అన్నారు. పట్టణంలోని చౌడేశ్వరి మాత, శ్రీదుర్గా మల్లికార్జున స్వామి దేవాలయంలో నాలుగు రోజులుగా జరుగుతున్న ధార్మిక ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన ధార్మిక కార్యక్రమంలో కర్నూలుకు చెందిన భానోజీరావ్ శ్రీమద్రామాణం, మహాభారతం, భగవద్గీతపై చేసిన ధార్మిక ప్రవచనాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అలాగే గోపూజలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు తెలుగు శ్రీను, డమాం సురేష్, డాక్టర్ దేవీ దయానంద సింగ్, అర్చకులు మద్దిలేటి, తెలుగు పరశురాముడు, హనుమప్ప పాల్గొన్నారు.

# గిరిజనుల అభివృద్ధే ధ్యేయం

- అర్హత ఉన్న కుటుంబాలకు ఇళ్ల పట్టాలు
- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- గుడుంబాయి తండాలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



లబ్ధిదారులకు సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని

ఓర్వకల్లు : గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గ్రామంలో అర్హులైన ప్రతి కుటుంబానికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తామన్నారు. శనివారం మండలంలోని కాల్వ గ్రామ సచివాలయం -2 పరిధిలోని గుడుంబాయి తండా గ్రామ పంచాయతీ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచు దీప్తి బాయి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసానితో పాటు, ఎంపీపీ తిప్పన్న, సింగిల్ విండో చైర్మన్ నాగతిరుపాలు, జేసీఎస్ మండల కన్వీనర్ లోటర్‌బాషా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బందితో కలిసి ఎమ్మెల్యే ప్రతి గడపను సందర్శించారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూనే.. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అందిస్తున్న అవినీతిరహిత పాలన, సంక్షేమ పథకాలను గురించి వివరించారు. కాటసాని మాట్లాడుతూ.. రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్ల పాలలో పేదలకు ఇచ్చిన హామీలన్నింటినీ దశలవారీగా అమలు చేశారన్నారు. రాబోయే ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తీసుకువస్తే గిరిజనుల సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పక్కాగృహాలను మంజూరు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, ఎంపీడీఓ శివనాగప్రసాద్, ఎంఈఓ ఓంకార్ యాదవ్, స్థానిక నాయకులు శ్రీనివాసనాయక్, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బనాయక్, మద్దిలేటినాయక్, రాజునాయక్, సక్రునాయక్ పాల్గొన్నారు.

**గోరుకల్లు రిజర్వాయర్‌పై ఆందోళన వద్దు**

జిల్లాలోనే అతిపెద్ద రిజర్వాయర్‌లలో ఒకటైన గోరుకల్లు రిజర్వాయర్‌పై ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే కాటసాని రాంపాల్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే విలేకర్లతో మాట్లాడుతూ.. రిజర్వాయర్ కరకట్ట అభివృద్ధికి రూ.100 కోట్లకు ప్రతిపాదనలు పంపడం జరింగిదన్నారు. పరిపాలనా ఉత్తర్వులు రాగానే టెండర్లు పిలిచి పనులను ప్రారంభించేందుకు సిద్ధంగా వున్నామని చెప్పారు. వారి పాలనలో కనీసం గేటుకూడా నిర్మించని టీడీపీ నేతలు తమపై విమర్శలు చేయడం హాస్యాస్పందంగా ఉందన్నారు. రిజర్వాయర్‌లో నీటిమట్టం తగ్గడంతోనే కరకట్ట వద్ద చీలికలు వచ్చినట్లు తెలిపారు. సమస్యకు శాశ్వత చూపుతామని, ప్రజలకుగానీ, రైతులకుగానీ ఎలాంటి ప్రమాదం రాకుండా చూసుకునే బాధ్యత తమదేనన్నారు. అనవసరంగా ప్రజలను భయాందోళనకు గురిచేసి రాద్ధాంతం చేయడం సబబుకాదని ఆయన తీవ్రంగా ఖండించారు.

**అర్హులందరికీ సంక్షేమ పథకాలు**

గడివేముల: కుల మతాలకు పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం గడివేముల ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు సకాలంలో సేవలు అందించేందుకు ప్రతి ఉద్యోగి కృషి చేయాలన్నారు. ప్రతి సచివాలయాన్ని తనిఖీ చేయాలని ఎంపీడీఓ శివమల్లేశ్వరప్పను ఆదేశించారు. ప్రతి గ్రామంలో అర్హులందరికి ఇంటిపట్టాలు మంజూరు చేస్తామన్నారు. జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణాలను త్వరితగటిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని ఆదేశించారు. బిలకలగూడూరు ఉర్దూ పాఠశాలలో ఉర్దూ టీచర్‌ను నియమించాలని గత సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే కోరినా ఇంత వరకు ఉన్నతాధికారులకు కూడా నివేదిక అందించకపోవడంపై ఎంఈఓ-2 విమలా వసుంధర దేవిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఎటువంటి లోటు లేకుండా డిప్యూటేషన్‌పై ఉపాధ్యాయుని నియమించాలన్నారు. మండలంలో భూ సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ శ్రీనివాసులుకు సూచించారు. రైతులు పండించిన జొన్న పంటకు త్వరలోనే ఆయా గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ప్రతి రైతూ రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు ఈ క్రాప్ నమోదు తప్పని సరిగా చేసుకోవాలన్నారు. అనంతరం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ స్థాయిలో మొదటి స్థానం సాధించిన బిలకలగూడూరు మహిళా జట్టును ప్రత్యేకంగా అభినందించారు. ఎంపీపీ నాగమద్దమ్మ, వైస్ ఎంపీపీ కాలునాయక్, సింగిల్‌విండో అధ్యక్షుడు పోగుల చంద్రశేఖర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ గురునాథ్, పీహెచ్‌సీ డాక్టర్ జబీన్, ఏఈలు భాస్కర్, పవన్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ తదితరులు పాల్గొన్నారు.



కబడ్డీ విజేతలకు మెడల్స్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే

# మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



పొదుపు సంఘాల మహిళలకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని
- నాల్గో విడతలో 1549 సంఘాలకు రూ. 9.41 కోట్లు మంజూరు
- సంతోషంతో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసిన పొదుపు మహిళలు

కల్లూరు: రాష్ట్రంలో మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. శనివారం కల్లూరు అర్బన్ 35వ వార్డులోని సుంకులమ్మ దేవాలయం దగ్గర మెప్మా అధికారుల ఆధ్వర్యంలో నాల్గో విడత వైఎస్సార్ ఆసరా వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే వైఎస్‌ఆర్ ఆసరా పథకం కింద కల్లూరు అర్బన్ పరిధిలోని 16 వార్డులకు చెందిన 1549 పొదుపు సంఘాల మహిళలకు మంజూరైన రూ. 9.41 కోట్ల చెక్కును అందజేశారు. అనంతరం ఆయన వారినుద్దేశించి మాట్లాడారు. పేదల అభ్యున్నతికి సీఎం అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. నవరత్నాల పేరుతో వివిధ పథకాలను అందిస్తున్నారన్నారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు స్వయం సహాయక సంఘాల బ్యాంకు రుణాలను విడతల వారీగా ప్రభుత్వమే చెల్లించిందన్నారు. కల్లూరు అర్బన్‌లోని 16 వార్డులకు కలిపి మొత్తం నాలుగు విడతల్లో రూ. 37.64 కోట్ల రుణాలు మాఫీ చేశామన్నారు.

**టీడీపీ నాయకులను నమ్మి మోసం పోవద్దు**

టీడీపీ నాయకులు చెప్పే అసత్యాలు, మాయమాటలను నమ్మి మోస పోవదని ఎమ్మెల్యే కాటసాని మహిళలకు సూచించారు. 2014లో టీడీపీ నాయకుడు చంద్రబాబు అనుభవం ఉన్న నాయకుడు అన్ని అధికారం ఇస్తే పొదుపు సంఘాల మహిళలతో పాటు రాష్ట్రంలోని ప్రతి ఒక్కరినీ మోసం చేశారన్నారు. రుణమాఫీ చేయకుండా రైతులు, పొదుపు మహిళలను నట్టేట ముంచారన్నారు. తమ పార్టీ అధినేత వైఎస్ జగన్ ఇచ్చిన మాట తప్పరన్నారు. 2019 ఎన్నికల ముందు ఇచ్చిన ఇచ్చిన హామీలన్నీ ఈ నాలుగున్నరేళ్ల పాలనలో పూర్తిగా అమలు చేశామన్నారు. కల్లూరు చెన్నమ్మ సర్కిల్ ఫ్లైఓవర్ బ్రిడ్జిని, కృష్ణానగర్ ఐటీసీ సర్కిల్ దగ్గర ఫ్లైఓవర్ బ్రిడ్జిని, చెన్నమ్మ సర్కిల్ నుంచి వివిధ కాలనీలకు వెళ్లే రోడ్లను విస్తరించామన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం వక్కెర వాగుపై బ్రిడ్జిని నిర్మించామన్నారు. హంద్రీ నదిలో పెరిగిన ముళ్ల కంపలు తొలగించామన్నారు. కల్లూరు అర్బన్‌లో తాగు నీటి సమస్య పరిష్కారం కోసం రూ. 125 కోట్లతో ఎనిమిది ఓహెచ్‌ఆర్ఎస్ ట్యాంక్‌లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఇలా ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టిన తమ ప్రభుత్వంపై టీడీపీ నాయకులకు మాట్లాడే అర్హతే లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీకే ప్రజలు పట్టం కడతారని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేణుక, అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, వ్యవసాయ సలహామండలి చైర్మన్ మహేశ్వర రెడ్డి,కార్పొరేటర్ మాధురి, మెప్మా పీడీ నాగ శివలీలా, టీపీఆర్ఓ వెంకటలక్ష్మి, టీఎంసీ సుధాకర్, మురళీ, కల్లూరు అర్బన్ 16 వార్డుల కార్పొరేటర్లు, నాయకులు వీరయ్య, సుకుమార్, కర్నాటి పుల్లారెడ్డి, హనుమంతురెడ్డి, భీమాశంకర్‌రెడ్డి, బాలచంద్రారెడ్డి, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన మహిళలు

## క్రీడాకారులను ప్రోత్సహించేందుకే 'ఆడుదాం..ఆంధ్ర'

- రవాణా, రోడ్లు, భవనాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీఎస్ ప్రద్యుమ్న

ఓర్వకల్లు: క్రీడాకారులను ప్రోత్సహించడానికే రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం..ఆంధ్ర క్రీడా పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని జిల్లా ప్రత్యేక అధికారి, రవాణా, రోడ్లు, భవనాల శాఖ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరి పిఎస్ ప్రద్యుమ్న తెలిపారు. ఆడుదాం..ఆంధ్ర క్రీడా పోటీలలో భాగంగా శనివారం కాల్వబుగ్గ గురుకుల పాఠశాల మైదానంలో నిర్వహించిన పాణ్యం నియోజకవర్గస్థాయి క్రికెట్ పోటీల ప్రారంభం కార్యక్రమంలో ఆయనతోపాటు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన పాల్గొన్నారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారి, డ్వామా పీడీ అమరనాథ్‌రెడ్డి బౌలింగ్ చేయగా, ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న బ్యాటింగ్ చేసి యువతలో క్రీడాస్ఫూర్తిని నింపారు. అనంతరం గెలుపొందిన క్రీడాకారులకు ట్రోఫీలను ప్రదానం చేశారు. ప్రథమస్థానంలో నిలిచిన కల్లూరు మండలం ఎఫ్‌సీఐ కాలనీకి చెందిన జట్టుకు రూ.35వేలు, రెండవ స్థానం సాధించిన గడివేముల జట్టుకు రూ.15వేలు, మూడో స్థానంలో నిలిచిన పాణ్యం జట్టుకు రూ.5 చొప్పున బహుమతులను బ్యాంక్ ఖాతాల్లో వేయనున్నట్లు అధికారులు తెలిపారు.

**పాఠశాలల సందర్శన**

సోమయాజులపల్లె గ్రామంలోని ఉన్నత, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను వారు సందర్శించారు. పాఠశాలలో నాడు- నేడు కింద చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా 2వ తరగతి విద్యార్థులతో కొద్ది సేపు ముచ్చటించి, వారి ప్రతిభను తెలుసుకున్నారు. 8వ తరగతిలో స్మార్టు బోర్డుల ద్వారా బోధనను పరిశీలించారు. ట్యాబ్‌లను విద్యార్థులు ఏ విధంగా ఉపయోగిస్తున్నారని ఆరాతీశారు. పాఠశాల చాలా బాగుందని, విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థానాలలో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఓ హిమప్రభాకర్ రాజు, డీటీసీ శ్రీధర్, డీఈఓ రంగారెడ్డి, ఎస్ఎస్ఏ పీఓ విజయజ్యోతికుమారి, సెట్కూర్ సీఈఓ రమణ, తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, ఎంపీడీఓ శివనాగప్రసాద్, ఎంఈఓ ఓంకార్‌యాదవ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



విజేతలకు ట్రోఫీ అందిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న, కలెక్టర్ సృజన

# ఎన్నికల యుద్ధానికి సిద్ధం కండి





సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, మాట్లాడుతున్న కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, పక్కన సమన్వయకర్త ఆదిమూలపు సతీష్,

- మూడో సారి కోడుమూరు కోటపై వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేద్దాం
- కుడా చైర్మన్ కోట్ల హర్ష, డా.ఆదిమూలపు సతీష్ పిలుపు
- కోడుమూరులో వైఎస్సార్‌సీపీ నేతల సమావేశం

కోడుమూరు రూరల్: ఎన్నికల యుద్ధానికి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సిద్ధం కావాలని కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డా.ఆదిమూలపు సతీష్ పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 3న అనంతపురంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరగనున్న 'సిద్ధం' సభ కోసం శనివారం కోడుమూరులోని శ్రీస్నేహ వినాయక కల్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ నేతలు, ప్రజాప్రతినిధులతో సన్నాహక సభ నిర్వహించారు. ముందుగా కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలో జరిగే ఎన్నికల యుద్ధంలో కోడుమూరు నియోజకవర్గంలో మూడో సారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేద్దామన్నారు. ఎన్నికల్లో జగనన్న గెలుపు కోసం సమష్టిగా కృషి చేద్దామని కోరారు. గత నాలుగున్నరేళ్లలో ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందాయని, మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా గెలిపించుకుందామన్నారు. ఫిబ్రవరి 3న అనంతపురంలో జరగనున్న 'సిద్ధం' సభకు నియోజకవర్గం నుంచి నేతలు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. డా.ఆదిమూలపు సతీష్ మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎన్నికలకు మనమంతా జగనన్న గెలుపుకోసం సైనికుల్లా శ్రమిద్దామని పిలుపునిచ్చారు. మరోసారి మన జెండా కోడుమూరుపై ఎగురవేసేంత వరకు అవిశ్రాంతంగా శ్రమించాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో కోడుమూరు, గూడూరు, కర్నూలు మండలాల జెడ్పీటీసీలు రఘునాథ్‌రెడ్డి, మౌలాలి, ప్రసన్న, ఎంపీపీలు బొంతల మునెప్ప, గాడి రూతమ్మ, సునీత, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, ఉపసర్పంచులు, మండల కన్వీనర్లు రమేష్‌నాయుడు, భాస్కరరెడ్డి, సోమశేఖరరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు కృష్ణారెడ్డి, ఎల్లారెడ్డి, గోపాల్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, వంశీకృష్ణారెడ్డి, కార్పొరేటర్ విక్రమ్‌సింహారెడ్డి, నాయకులు పోలకల్ ప్రభాకర్ రెడ్డి, మధుమోహన్‌రెడ్డి, పాటిల్ హనుమంత రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, ముల్లా సలీం, టిజి వెంకటేష్, బాయికాటి మద్దిలేటి, కలామ్, కుమార్, గోపాల్‌రెడ్డి, మాదులు, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

## గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలి

కల్లూరు: క్రీడల్లో గెలుపు ఓటములను క్రీడాకారులు సమానంగా స్వీకరించాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు ఓర్వకలు మండల కేంద్రంలో జరుగుతున్నాయి. శనివారం క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌లో గడివేముల జట్టుపై కల్లూరు అర్బన్ 21వ వార్డుకు చెందిన 54వ వార్డు సచివాలయం జట్టు విజయం సాధించింది. ఎమ్మెల్యే కాటసాని, డిప్యూటీ మేయర్ రేణుక, స్థానిక కార్పొరేటర్ అరుణ ఆ జట్టు క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో బాలచంద్రారెడ్డి, సుకుమార్, భీమాశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

## రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం



ప్రమాదానికి కారణమైన కారు

పాణ్యం: కర్నూలు - చిత్తూరు జాతీయ రహదారిపై పాణ్యం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ దుర్మరణం చెందింది. ఎస్ఐ అశోక్ తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల పట్టణం బైరమల్ వీధికి చెందిన ధనలక్ష్మి(54) పాణ్యంలోని తిరుమలగిరిలో సొంతిల్లు ఉంది. ఇల్లు అద్దెకు ఇవ్వడంతో ఇటీవల ఖాళీ అయ్యింది. ఈ క్రమంలో ఇంటిని శుభ్రం చేసేందుకు మరో మహిళతో కలసి శనివారం పాణ్యం చేరుకున్నారు. పని పూర్తయిన తర్వాత నంద్యాలకు తిరిగి వెళ్లేందుకు జాతీయ రహదారిపైకి చేరుకుని అవతలి వైపు దాటుతుండగా నంద్యాల నుంచి కర్నూలు వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో ధనలక్ష్మి అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న హైవే పెట్రోల్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని రహదారిపై ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. మృతదేహాన్ని నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును స్వాధీనం చేసుకుని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతురాలికి భర్త కొండయ్య, కుమారుడు ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## జాతీయ స్థాయి పద్యనాటక పోటీలకు 'శ్రీకృష్ణ కర్ణార్జునీయం'



నాటకంలోని సన్నివేశం

కర్నూలు కల్చరల్: జాతీయ స్థాయి పద్య నాటక పోటీలకు కర్నూలు టీజీవీ కళాక్షేత్రం వారి 'శ్రీకృష్ణ కర్ణార్జునీయం' నాటకం ఎంపికైంది. ఈ విషయాన్ని మిర్యాలగూడ సాంస్కృతిక కళా కేంద్రం కన్వీనర్ కృష్ణమూర్తి తనకు తెలిపారని కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. కళా కేంద్రం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం మిర్యాలగూడలో మార్చి 30 నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు జాతీయ స్థాయి పద్య, సాంఘిక నాటక పోటీలు జరగనున్నాయని తెలిపారు. ఈ పోటీలకు పద్య నాటక విభాగంలో తమ నాటకం శ్రీకృష్ణ కర్ణార్జునీయం ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల మొదటి వారం నుంచి నాటకాల ప్రాథమిక పరిశీలన జరిగిందని పేర్కొన్నారు. ఈ పద్య నాటకాన్ని పల్లేటి కులశేఖర్ రచించారని, తాను దర్శకత్వం వహించినట్లు పత్తి ఓబులయ్య తెలిపారు. జాతీయ పోటీలకు నాటకం ఎంపిక కావడంపై పలు కళా సంస్థలు, కళాకారులు హర్షం ప్రకటించారు.

## నేడు ఆసరా చెక్కుల పంపిణీ

గూడూరు: పట్టణంలో ఆదివారం వైఎస్సార్ ఆసరా పథకం కింద పొదుపు మహిళలకు చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ శనివారం తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ హాజరవుతారని, పొదుపు మహిళలు పాల్గొనాలని కోరారు.

## పారిశుద్ధ్య పనుల పరిశీలన

సి.బెళగల్: మండలంలోని పోలకల్ గ్రామంలో చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని ఈఓఆర్డీ సందీప్ శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వారంలో మూడు రోజుల పాటు (మంగళ, గురు, శనివారాలలో) ప్రత్యేక పారిశుద్ధ్య పనులను చేపట్టాలని తెలిపారు. ఇందులో భాగంగా గ్రామంలోని ప్రధాన రోడ్డు పక్కనున్న చెత్తను తొలగించాలని, కార్యక్రమాల నివేదికలను, వివరాలను ఎప్పటికి అప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేయాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు.

## తెలంగాణ మద్యం పట్టివేత

కర్నూలు : స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో తనిఖీల్లో 80 తెలంగాణ మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయి. కర్నూలు డీటీఎఫ్ సీఐ నర్సానాయుడు, సెబ్ సీఐ కేఆర్ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం మునగాలపాడు గ్రామ శివారులో వాహన తనిఖీ చేపట్టారు. తెలంగాణ రాష్ట్రంలోని పుల్లూరు టోల్ ప్లాజా వైపు నుంచి మునగాలపాడుకు వెళ్తున్న ఆటోను ఆపి తనిఖీ చేయగా అందులో 80 మద్యం బాటిళ్లు బయటపడ్డాయి. ఆటోలో ఉన్న మునగాలపాడు గ్రామానికి చెందిన మునికుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా టోల్‌ప్లాజా గేటు వద్ద ఉన్న మద్యం షాపు నుంచి కొనుగోలు చేసి మునగాలపాడుకు తీసుకెళ్తున్నట్లు అంగీకరించాడు. దీంతో అతనిపై కేసు నమోదు చేసి మద్యం బాటిళ్లను సీజ్ చేసినట్లు కర్నూలు సెబ్ సీఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐలు మారుతి ప్రసాద్, వీరస్వామితో పాటు సిబ్బంది షేక్షావలి, సుదర్శన్ రాజు, బషీర్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



అక్రమ మద్యం రవాణాదారుల అరెస్టు చూపుతున్న సెబ్ పోలీసులు

**కుటుంబాలను కలిపేలా కౌన్సెలింగ్**

కర్నూలు : చిన్నచిన్న సమస్యలు, కారణాలతో దూరమైన భార్యాభర్తలను కలిపేలా ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు దిశ మహిళా పీఎస్ డీఎస్పీ ఐ.సుధాకర్‌రెడ్డి అన్నారు. వివిధ కారణాలతో పోలీసులను ఆశ్రయించిన జంటలకు శనివారం దిశ పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. కలసి ఉంటేనే కుటుంబాలు బాగుంటాయని, క్షణికావేశంలో తల్లిదండ్రులు తీసుకునే నిర్ణయాలతో పిల్లలు అనాథలు కాకూడదని జంటలకు సూచించారు. చిన్నపాటి కారణాలతో విడిపోకూడదని, సర్దుకుపోతేనే జీవితం సాఫీగా సాగుతుందన్నారు. సీఐ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## 29న పీసీసీ అధ్యక్షురాలు షర్మిల రాక

కర్నూలు(సెంట్రల్): ఈనెల 29వ తేదీన పీసీసీ అధ్యక్షురాలు షర్మిల కర్నూలుకు రానున్నట్లు కర్నూలు, నంద్యాల జిల్లాల డీసీసీ అధ్యక్షులు కె.బాబురావు, జె.లక్ష్మీనరసింహయాదవ్ తెలిపారు. శనివారం రాత్రి డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 29వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు ఆమె కర్నూలులోని నంద్యాల చెక్‌పోస్టుకు చేరుకుంటారని, అక్కడి నుంచి ర్యాలీగా వెంకటరమణ కాలనీలోని తనిష్క్ ఫంక్షన్ హాలుకు చేరుకుంటారన్నారు. అక్కడ జరిగే కర్నూలు,నంద్యాల జిల్లాల విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని ప్రసంగించనున్నట్లు చెప్పారు.

## 30న దీక్షాదారుల సమ్మేళనం

కర్నూలు కల్చరల్: వికాస భారతి ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీ ఉదయం 10.30 గంటలకు ఓర్వకల్ మండలం కాల్వ బుగ్గ సమీపంలోని సురభి గోశాలలో వివిధ దేవీ దేవతల దీక్షాధారుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ సమన్వయకర్త పోచా మహేశ్వరరెడ్డి తెలిపారు. భారతీయ స్ఫూర్తి కేంద్రం అధ్యక్షుడు హుసేన్ రెడ్డి అధ్యక్షతన జరిగే సమ్మేళనంలో వికాస భారతి సంఘటనా కార్యదర్శి బీవీ నాగేంద్ర ప్రసాద్ ముఖ్య వక్తగా హాజరై ప్రసంగిస్తారని, చాగలమర్రి శివానంద ఆశ్రమానికి చెందిన పూజ్య శ్రీ అభినవ శంకరానందగిరి స్వామి వారు ఆశీర్వచన ప్రసంగం చేస్తారని పేర్కొన్నారు. 94932 54266 నెంబర్‌ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కోడుమూరు, పాణ్యం
70750 09147 (కోడుమూరు),
70750 09185 (పాణ్యం)
Office mail : sakshiknladvt@gmail.com